# బ్రతుకు నేర్చిన మనిషి

ఇంచుమించు ఏడెనిమిది మాసాలుగా అన్వేషిస్తున్నాను. చంద్రగిరిలో ఉన్నాడని తెలిస్తే అక్కడికి వెళ్ళాను. 'అబ్బే, కాళహస్తికి మార్పొచ్చిందండీ' అన్నారు. అక్కడికీ ఒకటికి రెండుమార్లు వెళ్ళాను. క్యాంపులో ఉన్నట్టు తెలిసింది. మూడోసారి వెళ్ళేసరికి 'మదనపల్లికి ట్రాన్స్‌ఫరొచ్చేసింది గదండీ' అనేశారు! అబ్బబ్బ, యిదంతా మాయలేడిని వెన్నంటిన వ్యవహారమై పోతోందనిపించి కాస్త చిరాకు కూడా కలిగింది.

కానీ నేనొక్క విషయం మాత్రం గట్టిగా చెప్పగలను. జీవితాలను భీమా చేసే ధీమా ఉన్నవాళ్ళ కోసం గ్రామ గ్రామాలనూ గాలించడమే నా పని. ఎక్కడో ఒకచోట, ఎప్పుడో ఒకప్పుడు వాడు నాకు తారసిల్లకపోడు. కనిపించగానే ఏకాంతంలోకి తీసుకెళ్ళి గుక్క తిప్పుకోడానికి వీల్లేకుండా నాలుగు చెంపదెబ్బలు ఎడా పెడా వాయించాలన్నదే నా అభిలాష! కానీ నాకో సందేహం కూడా వుంది. వాడు వాలి, వాలి పైకి ఎవడు మోహరించుకుని వెళ్ళినా వాడి బలంలో సగం వాలికి సంక్రమించేదని పురాణగాథ చెబుతుంది. చచ్చిన చావు సంగతెలా వున్నా బ్రతికినంతకాలం వాలి అజేయుడుగానే బ్రతికాడు. పోగా డేల్ కార్నిగీ 'మిత్రుల్ని సంపాదించడమెలా'గన్న, తన పుస్తకంలో ఓ విచిత్రోదంతాన్ని వివరిస్తాడు. అమెరికాలోనట - ఓ మహానుభావుడు వరుసగా పాతిక మందిని హత్య చేసేశాడట! ఇంత అఘాయిత్యం చేసినా తనను ఉరికి పంపడంలో అణుమాత్రమైనా న్యాయం లేదని అతగాడు ఆఖరు క్షణం దాకా హృదయ పూర్వకంగా విశ్వసించాడట! మావాడిలో ఆ వాలి లక్షణాలే గాక ఈ హంతక చక్రవర్తి లక్షణాలు కూడా వున్నాయి. ఎంత కోపంగా వెళ్ళినా, వాడి ముఖాన్నీ, ఆ సుమధుర దరహాసాన్నీ, ఆ హావభావ విన్యాసాన్నీ చూడగానే సగం కోపం చల్లారిపోతుంది. అంతటితో మనం చప్పబడి, వాడు నోరు తెరిచేశాడంటే - ఇక ఆత్మసమర్థన కాంక్రీటుతో కట్టిన కట్టడంలా రూపొందిపోతుంది.

కానీ తనకు పుట్టుకతోనే అబ్బిన ఈ జగజాణతనంతో వాడు నన్ను మోసగించలేడు! బహుశా నేను వాడిమీద చేయిజేసుకోలేక పోవచ్చు. ఐతే ఎదుట బడగానే 'ఇది నీకు బుద్ధి గాదు, నువ్వు చదివిన చదువుకూ, చేస్తున్న ఉద్యోగానికీ యిది యోగ్యత కాదు' అని దుయ్యపట్టడం మాత్రం నా చేతనౌను!

వాడి పేరు వీరభద్రం. వయస్సు ముప్పైకి దరిదాపుల్లో వుంటుంది. మనిషి స్ఫురద్రూపి. పైగా పైపై హంగుల్ని సంతరించుకోడంలో అప్రమత్తుడు. పరువుగా బ్రతికిన కుటుంబం వాడిది. అంచేత వాడి మర్యాదలోనూ, మన్ననలోనూ లోపాల్ని వ్రేలెత్తి చూపడం దుస్తరం. వాడు మంచి వక్త. మీదు మిక్కిలి నటుడు. హైస్కూల్లో వాడి నటనకు (నాటకాల్లోని నటనకే ననుకోండి) బోలెడన్ని

ప్రైజులు వచ్చాయి. స్కూలు ఫైనలు దాటగానే మేమిద్దరమూ విడిపోయాము. వీరభద్రం కాలేజీకి వెళ్లాడు. నాలుగేళ్ళు చదివి చిట్టచివర ఫెయిలై కూచున్నాడు. ఐనా వాడందుకు చింతించలేదు. పరీక్ష పోయిందనీ, పోయినా ఈ నాలుగేళ్ళలో తను లెక్కలేనంత లోకానుభవం గడింపగలిగాడనీ, ముఖ్యంగా తన నటన రాటుదేలి పదహారు వన్నెల బంగారమై పరిమళిస్తోందనీ, వెండి గిన్నెలు అలమరాకు పట్టడం లేదనీ, జాబు వ్రాశాడు. పరీక్ష ఫెయిలయిన సంవత్సరమే వాడికి పెళ్ళయింది. పిల్లనిచ్చిన మామగారే రెవిన్యూ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చూచిపెట్టారు. మూడేళ్ళు ఉద్యోగం చేశాడో లేదో ప్రమోషను కూడా వచ్చింది.

ఆ వచ్చిన ప్రమోషను పిలిస్తే పలికే జవానుతో, నలభై రూపాయల ఫిక్స్‌డ్ టి.ఎ.తో, ఒక ఫిర్కాపైన అధికారంతో సహా వచ్చింది.

సదరు ప్రమోషను వచ్చిన క్రొత్తలోనే నేను చివరిసారిగా వీరభద్రాన్ని కలుసుకోవడం కూడా జరిగింది.

వాకబు చేస్తూ వెళ్లి ఇంటిని వెదికి పట్టుకోగలిగాను. అది మూడంకణాల మిద్దెటిల్లు. ఇనుప కమ్మీ లమరించిన వరండాలో బోనులో బిక్కరిస్తున్న మేకలాగా జవాను కనిపించాడు.

మెట్లెక్కి వరండాలో కాలుబెట్టాను. నిలునిలుమన్నట్టుగా అతడి చూపులు నన్ను అటకాయించాయి.

ఎలా ప్రశ్నించాలో తోచింది గాదు. ప్రయత్నపూర్వకంగా ఉద్యోగుల లోకంలో వ్యవహృతమౌతున్న పరిభాషను జ్ఞప్తికి తెచ్చుకుని "అయ్యగారున్నారా?" అని ప్రశ్నించాను.

"లేరు" అన్నాడా జవాను. వెలిగిన క్షణాన్నే ఆరిపోయిన టార్చి లైటు వెల్తురు లాంటి జవాబు. ఆరిపోగానే మళ్ళీ ముసురుకున్న చీకటి లాంటి మౌనం. విగ్రహం లాంటి మనిషి.

"ఇంట్లోనే లేరా? ఊళ్ళోనే లేరా?" మళ్ళీ నా ప్రశ్న.

"ఇంట్లో లేరు."

"ఊళ్ళో ఉండవచ్చు గదూ?"

"ఉండొచ్చు."

"లేదా క్యాంపు కూడా వెళ్లి వుండవచ్చుననుకుంటాను."

"వెళ్లీ ఉండొచ్చు..."

"ఎప్పుడొస్తారో నీకు తెలియదు?"

"తెలియదు."

ఓరి వీడి బంట్రోతుతనం కూలిపోనూ! బలిచక్రవర్తిని చూడ్డానికి వెళ్ళిన రావణాబ్రహ్మకు ద్వారం దగ్గర కనిపించిన దివ్య మంగళ విగ్రహుడావీడు!... ఈ ఊహ నాకు నాకే ఎబ్బెట్టుగా తోచినా, అందులో కాస్తో స్వారస్యం కూడా కద్దనిపించింది. విష్ణుమూర్తి ఏం చేశాడు? భూలోకంలో సమస్త మానవానీకానికి తెలిసేటట్టుగా విశ్వరూపం దాల్చి బలిచక్రవర్తిని అణగద్రొక్కాడు. ఆ తరువాత రసాతలంలో ఎక్కడో నీ వాకిటి కావలి బంటుగా వుంటాను పొమ్మన్నాడు. బంట్రోతుల్లో కూడా కొందరు తమపై అధికారిని గురించి బయట విరివిగా దుష్ప్రచారం సాగిస్తారు. ఇంట ఆత్మీయులుగా, అంతరంగిక మిత్రులుగా అమరి వుంటారు!

'అయ్యా, మహాశయా! నేను రెవిన్యూ యిన్‌స్పెక్టరు గారిని చూడ్డానికి రాలేదు. వీరభద్రాన్ని చూడ్డానికి వచ్చాను. వాడు నా చిన్ననాటి చెలికాడు' అని చెబుదామనుకున్నాను. కానీ ఎంత చెప్పినా,

ఎలా చెప్పినా అతడు అర్థం చేసుకునే ధోరణిలో లేడు!

చెప్పదలచుకున్న విషయాన్ని చేతగా మార్చుకోడమే సబబని తోచింది. త్రుటిపాటులో అతన్ని తప్పించుకుని చరచరా లోపలికి వెళ్ళి పోయాను.

కాళ్ళూ చేతులూ విదిలించుకుంటూ గిజగిజలాడిపోతున్న బిడ్డ నోట్లో మందు పోస్తున్న మాలతి "అబ్బబ్బ, ఎన్నాళ్ళ కెన్నాళ్ళకు! కూచోండన్నయ్యా! బాగున్నారు కదూ!" అంటూ వుపచరించింది.

"అదేమిటమ్మాయ్! పాపాయికి ఒంట్లో కులాసాగా లేదేమిటి?" అన్నాను.

"మొదట జలుబు, దాని వెనువెంటనే జ్వరం. రాత్రంతా మూసిన కన్ను తెరవలేదు. ఏం చేయమంటారన్నయ్యా! ఈ అబ్బనాకారాపు బిడ్డలతో వేగలేక సతమతమై పోతున్నాను..."

"నిజమే మరి! అందులోనూ పెద్ద దిక్కు లేకపోయె! బిడ్డలన్న తర్వాత వాళ్ళకేదో ఒకటి వస్తుంది. వస్తే ఏం చేస్తుంది? దానంతటదే పోతుంది..." అని కాసేపాగి, "కొత్త చోట కాపురమనుకుంటాను, అన్ని సౌకర్యాలూ కుదిరాయా అమ్మాయ్?" అంటూ పరామర్శించాను.

బిడ్డను తొట్టిలో వేసి వూపుతూ చెప్పుకుపోతోంది మాలతి. బావిలో నీళ్ళు చేంతాటి కందడం లేదనీ, పని మనిషిని నమ్మడానికి వీల్లేదనీ, లభ్యమౌతున్న పాలలో నీటిపాలే ఎక్కువనీ... ఇలా సాగిపోతోంది ప్రసంగం.

పది నిమిషాలు అలా కొనసాగిన తర్వాత ప్రసంగం ఆమె పుట్టింటి వైపు ప్రసరించింది. పుట్టింటి నుంచీ మరెక్కడికి విస్తరిస్తుందో తెలియడం లేదు. 'ఓహో, ఔనౌను, అలాగా' అన్న మాటలతో అక్కడక్కడా నేను అడ్డు తగలకుండా వున్నట్లయితే ఆమె వాగ్ప్రవాహం పేరాగ్రాఫులు కూడా లేని రచనలా ఏకంగా ప్రాకిపోయి వుండేది.

చిత్రమేమిటంటే యింతసేపు మాట్లాడింది గదా మాలతి, ఆమె మాటల్లో మచ్చుకొకసారైనా వీరభద్రాన్ని గురించిన ప్రసక్తి పొడసూపలేదు.

ఆఖరుకు నేనే అడిగాను - "అది కాదమ్మాయ్! వీరభద్రాన్ని గురించి ఒక మాటకూడా చెప్పావు కాదే"మని!

తెచ్చిపెట్టుకున్న వుత్సాహమేమో మరి, అది ఒక్క పెట్టున చల్లారి పోయింది. గబగబా ముడుచుకున్న పద్మంలా ఆమె ముఖం కాసంతై పోయింది.

ఇక్కడేదో దురూహ్యమైన రహస్యముందిరా బాబో అనుకున్నాను.

అనుకోడంతో ఏమయింది? అంతు కనుక్కోవాలి కదా! మళ్ళీ అడిగాను - ఎక్కడికి వెళ్లాడమ్మా అని!

"ఎక్కడికి వెళ్ళారో మరి! కోటయ్యను అడిగి చూడాలి..."

కాసేపు వేచి చూచాను. అడిగి చూడాలంటుందే గానీ అడగదే మాలతి!

"ఐతే - బయటికి వెళ్తున్నప్పుడు ఎక్కడికి వెళ్తున్నాడో, ఎప్పుడు తిరిగి రాగలడో నీతో చెప్పి వెళ్ళే అలవాటు లేదన్నమాట?"

'మగవాళ్ళన్న తర్వాత వెయ్యి పనులుంటాయన్నయ్యా! ఎక్కడికైనా వెళ్ళగలరు. ఎప్పుడైనా రాగలరు. ఆదివారం గదా, ఈరోజు ఎక్కడికీ వెళ్ళరేమో ననుకున్నాను. ఉదయం ఎనిమిది గంటలప్పుడు కూడా ఆఫీసు రూంలో ఎవరితోనో మాట్లాడుతుండగా విన్నాను. ఎనిమిదిన్నరకు కాఫీ తీసుకెళ్ళేసరికి అక్కడ లేరు..." అప్పటికి గానీ కాఫీతో నాకూ కాస్త అవసరముంటుందన్న విషయం తోచింది గాదు మాలతికి! "ఉండండన్నయ్యా! ఇప్పుడే వస్తాను" అంటూ వంట గదిలోకి పరుగు

తీసింది.

మాలతి తీసుకొచ్చిన కాఫీలో తీపి తక్కువ. గృహ వాపతావరణంలో అంతర్లీనమై వున్న వికారం కాఫీ పైన కూడా పనిచేసి, ఆ పానీయాన్ని మరీ చేదుగా మార్చి వేసినట్టుంది. ఆ వికారాన్ని ఏమనుకోవాలి? విరసమా, వైమనస్యమా? ఏమైనా కాకపోయినా ఒకరిపట్ల ఒకరిలో వైముఖ్యం వ్రేళ్లు పాతుక పోగా ఈ భార్యాభర్తలు ఎడముఖం, పెడముఖంగా ప్రవర్తిస్తున్న సూచనలు కానవస్తున్నాయి. ఇలా ఆలోచిస్తూ ఆ వైశాఖ మాసం మిట్ట మధ్యాహ్న సమయాన పేవ్‌మెంట్ పైన నడచి పోతున్నాను. గుంపులు గుంపులుగా కదలిపోతున్న ప్రేక్షకుల్లో నుంచీ గొంతెత్తి పిలిచాడు వీరభద్రం!

అదే వేషం..... అదే హాసం .... మనిషిలో మార్పు గోచరించడం లేదు. ఈ వీరభద్రం ఏడాది పొడుగునా విరగబడి పూచే నిత్యమల్లిలాంటి వాడా ఏమిటి! సామాన్య మానవుల్ని చుట్టు ముట్టే కష్టనష్టాలూ, చీకుచింతలూ వీడిని స్పృశించనే స్పృశించినా? వీడు వాటి కతీతుడా! ఏమిటో మరి - ఈ నిశ్చింత. ఈ నిత్య సంతోషం అందరికీ అబ్బేవీ గావు.

వీరభద్రం నన్ను వెంటబెట్టుకుని ఓ పెద్ద హోటల్లోకి దారతీశాడు. వెళ్ళి కూర్చున్న కొద్ది సేపటికల్లా కూల్‌డ్రింక్స్ టేబిలుపైకి వచ్చేశాయి.

"నీ కోసం యింటికి వెళ్ళొస్తున్నాను" అని చెప్పడానికి రెండు మూడుసార్లు ప్రయత్నించాను. కానీ పెదవి కదపడానికి అవకాశమేదీ! బ్లూ మౌంటన్ ఎక్స్‌ప్రెస్‌లా సాగిపోతున్నాడు వీరభద్రం!

ఇటీవల అందుకని మదరాసు వెళ్ళి చూచివచ్చిన సినిమాల్లోని మహత్తర దృశ్యాలు, నవాబ్ రాజమాణిక్యం నాటకంలోని విశేషాలు, గార్డనర్ నవలలో పెర్రీమాసన్ సాహసాలు ..... ధారావాహినిగా చెప్పుకు పోతున్నాడు వీరభద్రం,

వాడు చెబుతున్న ప్రతి విషయమూ నా కందుబాటులో లేనిదే! ప్రతిమలా వింటూ కూర్చున్నాను.

గోడ గడియారంలో ఒంటిగంట కావస్తోంది.

వీరభద్రం సర్వరును పిలిచి ఆకులు వేసేయమన్నాడు.

"ఇదేం కర్మరా వీరభద్రం! లక్షణంగా యిల్లుండగా హోటల్లోనా భోజనం?" అంటూ తెల్లబోయాను.

"నీకు తెలియదు లేరా బాబూ! మా ఆవిడ పని ఆ కుర్రకుంకలతో వేగడంతోనే సరిపోతోంది. ఇంక మనల్ని చూడగానే ప్రారంభిస్తుందనుకో, ఆ వంట మూడు గంటలకు గానీ తెమలదు. ఎందుకొచ్చిన గొడవ చెప్పు! అదనంగా ఒకరికి శ్రమ కలిగించడం భావ్యం కాదు గదా! భార్య అన్న వ్యక్తి గూడా అందరిలాంటి మనిషేనన్న విశాల భావంతో చెబుతున్నాను." ఆదిలో మెల్లగా నవ్వసాగిన వీరభద్రం తన సంజాయిషీ పూర్తయ్యేసరికి బకెట్లో గిన్నెలు కడుగుతున్నట్టుగా ఉద్ధృతంగా నవ్వసాగాడు.

"ఐతే నువ్వు మీ ఆవిడమీద ఈగనుగూడా వ్రాలనీయడం లేదన్నమాట?" ఆశ్చర్యంగా ప్రశ్నించాను.

వీరభద్రం నా ముఖంలోకి పరిశీలనగా చూస్తూ "నువ్వు యింటికెళ్ళొస్తున్నావా ఏమిటి?" అన్నాడు.

అవునన్నాను.

"నిజం చెబుతున్నానురా రామం! నా మూలంగా ఆవిడకు ఆవగింజంత కష్టమైనా

కలగడంలేదు. నేనొక రోజు యింట్లో భోజనం చేస్తే అయిదు రోజులు బయటుండి పోతున్నాను. ఇక కలుగుతున్న చింతలూ వంతలూ తనకు తన మూలంగానే కలుగున్నాయంటే అందుకు నాది జవాబ్దారీగాదు!"

"ఏడ్పావులేరా వీరభద్రం! నీ వాలకం చూడగానే తెలిసిపోతోంది. ఊళ్ళో యిల్లుండగా నువ్వు హోటల్లో భోజనానికి సిద్ధమయ్యావు. బిడ్డకు ఒంట్లో బాగుండకపోయినా, అదేం పట్టనట్లు సినిమాకు వెళ్ళొస్తున్నావు. ఎవరి దగ్గర నీ బుకాయింపులు?...." అన్నాను.

వీరభద్రం నా అవివేకానికి జాలిపడుతున్న వాడిలా నావైపు విచిత్రంగా చూచాడు. "అదికాదురా బాబూ! హోటల్లో భోజనం చేయడానికి కారణ మేమిటో చెప్పనే చెప్పాను. ఇక సినిమాకు వెళ్ళడమంటావా, ఏదో మనబోటివాళ్ళం వెళ్తున్నాము. గనుకనే సినిమాలు జరుగుతున్నాయి. బిడ్డకు కాస్త నలతగా వున్నమాట నిజమే ననుకో! కానీ అందుకు నేను చేయగలిగిదేముంది చెప్పు! మేమున్న వీధిలోనే యిద్దరు డాక్టర్లున్నారు. కోటయ్యతో ఒకమాట చెబుతే వాడే తీసుకొస్తాడు..."

"దొరికినా సరైన కోటయ్యే దొరికాడులే నీకు! తన్ని తగలేస్తాడేమో నన్నంత భయపడి పోయాను" అంటూ భోజనానికి వుపక్రమించాను.

"వాడంతే! వాడంతే!" విరగబడి నవ్వేశాడు వీరభద్రం. "వాడు మహా మహావాళ్ళనే ఖాతరు చెయ్యడు. కానీ మనమంటే మాత్రం సింహ స్వప్నం. ఐతే, నువ్వు వాడితోనూ భేటీ అయ్యావన్నమాట! మోతాదుమించి మాట్లాడలేదుగదా! వాడు వట్టి అబద్ధాలకోరు!"

కానీ నేను వీరభద్రం స్టేటుమెంటు ప్రకారం కోటయ్యను అబద్ధాల కోరుగా నమ్మేస్థితిలో లేను. ఎందుకంటే వీరభద్రం సత్యసంధత పట్ల గూడా నాకు అనుమానాలున్నాయి.

భోజనమైన తర్వాత బజార్లో కొన్ని తొందర పనులుండడంవల్ల వీరభద్రం దగ్గర సెలవు తీసకుని హోటల్లోనుంచీ బయటపడ్డాను. రేడియోలో ఏవో రికార్డులు రాబోతున్నాయనీ, అవి పూర్తి కాగానే నేరుగా యింటికే వెళ్తాననీ చెప్పాడు వీరభద్రం!

* * *

వీరభద్రాన్ని ఆనాడు హోటల్లో చూడడమే చూడడం, ఆ తరువాత రెండేళ్ళు గడిచిపోయాయి.

ఈమధ్య కోటయ్య ఒకసారి తాలూకాఫీసు ప్రాంగణంలో కనిపించడంలో అబ్బురమేమీ లేదుగానీ, అతడు వసపిట్టలా వాగేశాడు. అతడలా వాగడం కోసం నేను సమర్పించుకున్న ఉపాయనం ఓ కప్పు కాఫీ మాత్రమే!

"ఇప్పుడు నేను వీరభద్రం గారి దగ్గర లేనండీ!" అన్నాడు కోటయ్య.

"అబ్బే, వాడిదగ్గర పనిచేయడం కంటే, హాయిగా వుద్యోగం మానేయడమే మేలు! వాడి సంగతి నాకు బాగా తెలుసు" అన్నాను.

అంతటితో పుంజుకున్నాడు కోటయ్య.

సంసారం వీరభద్రానిదైనా దాన్ని నిర్వహించే భారం కోటయ్యేదేనట! ముందూ వెనకా చూడకుండా బజారులో అప్పులు పెరిగిపోతూ వుండవలసిందే! నెల పుట్టగానే అప్పులిచ్చిన వాళ్ళు మేలుకుంటారు. కోటయ్య ముఖం కనిపించగానే ఖాతా పుస్తకాలు పైకి తీస్తారు. చేతులు నులుముకుంటూ వీరభద్రం ఎదుట నిలబడి కోటయ్య 'కొద్దో గొప్పో ముట్టజెప్పక పోతే ఎలాగండీ' అంటాడు. వీరభద్రం బదులు చెప్పడు!

'ఇదిగో! కోటయ్యా! సిగరెట్లు తెచ్చిపెట్టు' అంటాడట వీరభద్రం. కానీ డబ్బు మాత్రం

ఇవ్వడు. అవతల బంకులో, చిల్లరంగడిలో, బట్టల కొట్టులో, ఫ్యాన్సీషాపులో - ఇందుగలవందులేవన్న సందేహానికి చోటులేకుండా ఎక్కడా బాకీలే! ఏం చేయగలడు కోటయ్య! అప్పులవాళ్ళు నిలవేసి అడిగారు. 'బాబ్బాబూ! నేనే పాపమూ ఎరుగను. వెళ్ళి ఆయన్నే పలకరించండి' అన్నాడు కోటయ్య. వాళ్ళంతపనీ చేశారు. కానీ ఆగ్రహోదగ్రుడై పోయాడట వీరభద్రం! నే నెవరిని, మీ రెవరు? మీ ముఖం ఎవరు చూచారు? పోపొమ్మనేశాడు!

ఆఖరుకు వాళ్ళందరూ తమకు కలిగిన నష్టానికి పరిహారంగా కోటయ్యను సున్నంలోకి ఎముకలేకుండా చిత్తుచిత్తుగా బాదేయాలన్న నిర్ణయానికి వచ్చేశారట!

"మీ వీరభద్రానికి పదివేల నమస్కారాలు. నిభాయించుకోలేక పారిపోయి వచ్చేశాను బాబూ! నేను లీవు పెట్టేశానా, ఆ ఖాళీలో మరొకణ్ణి వేశారు. వాడూ పదిరోజుల్లో పరారైపోయాడు...." అంటూ ముగించాడు కోటయ్య.

ప్రతి జవానూ యిలానే అయితే వీరభద్రం గతి ఏం కావాలన్న ఆలోచనలో పడ్డాను. వీరభద్రం తనంతట తానుగా వెళ్ళి అప్పులకోసం బ్రతిమాలుకోలేడు. ఒకవేళ అలా బ్రతిమాలుకోడం మూలంగా అప్పులు పుట్టినా, తప్పనిసరిగా వాటిని చెల్లించుకోవలసి వుంటుంది. కానీ అలా అప్పులు తీర్చడం వాడి ఆరోగ్యానికి బొత్తిగా సరిపడని విషయం గదా! అయ్యో పాపం .... నాకు వీరభద్రం పైన కాస్త జాలిగూడా కలిగింది.

కోటయ్య ద్వారా ఈ వర్తమానం తెలిసిన తర్వాత ఒకసారి వీరభద్రాన్ని కలుసుకుని ఘాటుగా మందలించాలన్న ఉద్దేశం కలిగింది. ఈ వుద్దేశంలో ఉండగానే ఓ రోజు సాయంత్రం తిరుపతి బస్టాండులో చలమయ్యగారు కనిపించారు.

చలమయ్య గారంటే వీరభద్రానికి పిల్లనిచ్చిన మామగారు.

నన్ను చూడగానే ఆయనకు ప్రాణం లేచివచ్చినట్టయింది. "జాబుగూడా వ్రాయాలనుకున్నాను. కానీ చిరునామా సరిగ్గా తెలిసింది గాదు. రావయ్యా బాబూ! నీతో చాలా విషయాలు మాట్లాడాలి' ' అంటూ నన్నాయన దూరంగా తీసుకెళ్ళారు.

ఆయన మాట్లాడ బోతున్న విషయాలేవో నాకు చూచాయగా తెలుసు. అనుకున్నట్టుగానే పెద్ద ఉపోద్ఘాతమేమీ లేకుండానే ఆయన అసలు విషయం లోకి వచ్చేశారు.

ముఖ్యమైన విషయ మేమిటంటే - మాలతి గూడా కోటయ్యకు మల్లే ఆ కాపురం చేయలేక పెట్టే - బేడా సర్దుకుని పుట్టింటికి వచ్చి చేరిపోయింది!

"రాకేం చేస్తుంది నాయనా, ఆడబిడ్డకు ఆలనా పాలనా లేకపోయిన తర్వాత!" నావైపు దీనంగా చూచారు చలమయ్య గారు. "అతగాడికి పెళ్ళామంటూ ఒక మనిషి యింట్లో వుందన్న ధ్యాసే లేదు. అతడికోసం ఏ పూట భోజనం చేయాలో, ఏ పూట చేయనవసరం లేదో వూహించడం అసాధ్యం. అంత పంక్చువల్‌గా యింటికొస్తాడన్నమాట! తన సినిమాలు, తన హోటళ్లు, తన ఉబుసుపోకలు - యివే అతడి ప్రపంచమైతే యిక అమ్మాయి కక్కడ పనేముంది చెప్పు! వాడి ప్రాణానికి వుసూరుమంటూ ఆమె బిడ్డలతో సహా వచ్చి మా పాలబడింది. కన్నబిడ్డ తల్లిదండ్రులకు భారం కాబోదుగదా!" కాసేపాగి పెదవి విరిచి తలవూపుతూ అన్నారు చలమయ్యగారు: "నాకో విషయం బాగా అవగతమై పోయింది బాబూ! వాడు బాగుపడడం కలలోని మాట! ఏనాటికైనా వాడు మట్టి గుర్రమే! అందుకనే నేను దూరదృష్టితో ఓ పని చేసేశాను."

"ఏం చేశారేమిటి?" కంగారుగా ప్రశ్నించాను.

"నీ స్నేహితుడికేమీ ప్రమాదం తలపెట్టలేదు లేవయ్యా రామం! నేను తీసుకొన్న జాగ్రత్త మా అమ్మాయిని గురించే! ఎందుకైనా మంచిదని ఓ కుట్టుమిషను కొనిపెట్టాను. కొంతకాలంపాటు పడిలేస్తే ఆ పనిలో చేయి తిరుగుతుంది. చేతిలో ఒక పని ఉన్నట్టయితే ఎవరికి వారు మరొకరిపైన ఆధారపడకుండా జీవితం గడుపుకోవచ్చు. అదీ నా ఆలోచన! నువ్వేమంటావో మరి!"

అనడానికేముంది? ఆయన చాలా మంచిపనే చేశారు. నేనేమైనా అనదలచుకున్నట్టయితే ఈ వీరభద్రాన్నే అనాలి.

"కాపురం యిలా వెలగబెట్టాడా, యిక ఆ వుద్యోగం సంగతి సరేసరి! అడివిలో ముళ్ళపొదల్లా ఫైళ్ళు పెరిగిపోతూ వుండవలసిందేః! పై అధికారుల దగ్గరినుంచీ ఎక్స్ప్లనేషన్ల కోసం తాఖీదులు వస్తూ వుండలసిదే! వీడి స్వైర విహారాలు మాత్రం యధాప్రకారంగా సాగుతూ వుండవలసిందే! ఇందుకు గాకపోతే నెలకో వూరికి ట్రాన్స్ఫరెందుకొస్తుందో చెప్పు...."

నోటమాటరాక నేను దిగాలుపడి నిల్చుండిపోయాను. నన్నా అవస్థలోనే దిగవిడిచి, బస్సుకు వేళమీరి పోతుందని చలమయ్యగారు గబగబా వెళ్ళిపోయారు.

వీరభద్రం పట్ల నా కాదినుంచీ కొన్ని అనుమానాలు కద్దు. క్రమబద్ధంగా ఓ కార్యాన్ని నిర్వహించడమనేది వాడి తత్వానికి సరిపడని సంగతి. ఇలాటివాడు ఇటు సంసార సాగరాన్ని యీదడంలోనూ, అటు ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తించడంలోనూ ఎంతవరకు కృతకృత్యుడు కాగలడన్నది సందేహాస్పదమైన విషయమే! కానీ ఈ అనుమానానికి వెనుక నాకో ఆశ గూడా వుండేది. చెరుకువంకరను గానుక చక్కబరచినట్టుగా వీరభద్రం లోని వక్రస్వబావం కాలక్రమాన చక్కబడవచ్చునని నేను భావించాను. కానీ నాకు చలమయ్య గారు కనిపించన తరువాత ఆ ఆశ గూడా పటాపంచలై పోయింది.

ఇంక నాకు మిగిలివున్న కోరిక ఒక్కటే! వీరభద్రాన్ని కలుసుకోవాలి. వాడి మూర్ఖత్వాన్నీ, తెంపరితనాన్నీ వాడికే వివరించి, సమాజంలో బ్రతకడానికే వాడనర్హుడన్న యధార్థాన్ని కుండబ్రద్దలు కొట్టినట్టుగా చెప్పేయాలి. అప్పటికి నేను నా కర్తవ్యాన్ని నిర్వహించిన వాడినౌతాను. ఆ తరువాత వాడేమైనా నాకు చింతలేదు.

సరిగ్గా ఈ ఘట్టంలోనే - నేను వీరభద్రంకోసం పనిగట్టుకుని అన్వేషణ కొనసాగించినప్పుడే వీరభద్రం మాయలేడిలా మారి నన్ను వూళ్ళు త్రిప్పించాడు. ఆఖరుకు ఓ రోజు రాత్రి ఏడుగంటలప్పుడు నా చేతికి దొరకనే దొరికాడు వీరభద్రం. కానీ వాడు నా చేతికి దొరికింది థియేటరు లోపల! చేయి చేసుకోడానికి గాదు సరిగదా, దుయ్యపట్టడానికి గూడా వీల్లేని పరిస్థితి.

చేసేది లేక వాడిపైన నా ఆరోపణలను మాత్రం మోపి, వాటికి బదులు చెప్పవలసిన అవసరం లేదనీ, చెప్పినా నేను వినిపించుకోబోవడం లేదనీ కచ్చితంగా చెప్పేశాను.

నా ఆరోపణలు ముచ్చటగా మూడు -

ఒకటి : వీరభద్రం తన తాహతుకు మించిన అప్పులు చేస్తున్నాడు. వాటిని తీర్చే ప్రసక్తి కలలోనైనా తలపెట్టడంలేదు. కోటయ్య చెప్పకుండా పారిపోవడమే అందుకు తార్కాణం!

రెండు : వాడు భార్య పట్ల కనపరుస్తున్న అనాదరణ అవధుల్లేనిది. ఎంతగా మనసు చెదిరిపోకపోతే ఆమె తన జీవనానికి దర్జీవృత్తిని ఆలంబనంగా స్వీకరిస్తుంది?

మూడు : ఉద్యోగిగా గూడా వీరభద్రం తన అప్రయోజకత్వాన్ని నిరూపించుకున్నాడు. మాటిమాటికీ వచ్చి పడుతున్న ట్రాన్స్ఫరు ఆర్డర్లు అందుకు తిరుగులేని నిదర్శనాలు.

నా మాటల్ని వింటూ ఆశ్చర్యంతో నోరు తెరిచేశాడు వీరభద్రం. "ఒరేయ్, ఒరేయ్! ఇదేమిట్రా రామం! ఉన్నట్టుండి నీకుగానీ పిచ్చిబట్టిపోలేదు గదా!" అన్నాడు.

తెల్లబోయి అయోమయంగా వాడివైపు చూచాను.

"కాకపోతే నువ్విలా మాట్లాడేవాడివే గావు. నేను మితిమీరి అప్పులు చేశాను. వాటిని తీర్చలేక పోతున్నాను. అందుచేత కోటయ్య పారిపోయాడనుకుంటున్నావు! ఇంతకంటే శుద్ధ అబద్ధం మరొకటి ప్రపంచంలో ఉండబోదు. వాడు- ఆ ఫుండాకోరు అయిన బీడీలన్నీ కాల్చి, అయిన టిఫిన్లన్నీ తిని, ఒపినన్ని అప్పులు చేసి పెడ్తే వాటిని నేను చెల్లించాలనా నీ వుద్దేశం! బాగుందిరా బాబూ, బాగుంది. పోతే - భార్యను నిరాదరణ చేశానంటావు. నువ్వు నా బాల్యమిత్రుడివి! నువ్వు అనావచ్చు, నేను వినావచ్చు. కానీ నువ్వీలాటి తెలివితక్కువ ఆరోపణ చేయగలవని నే నేనాడూ అనుకోలేదు. ఎంతో నిరాదరణ చేశాను నేను? కొట్టానా? తిట్టానా? చీదరించుకున్నానా? లేదే! గిరిగీసి దీన్ని దాటగూడదని కట్టుబాటులో వుంచానా? లేదే! ఆవిడను గూడా సాటి మనిషిగా ట్రీట్ చేశాను. పనిమనిషిగా భావించలేక పోయాను. ఇది నా తప్పయితే కావచ్చు, తన అభిరుచులు తనవి. నా అభిరుచులు నావి. వాటికి పొత్తుకుదిరేమాట కల్ల! కానీ వీలైనంతలో నేను చేయగలిగిందేముంది? సరే, పుట్టింటికి వెళ్ళింది. వెళ్తే వెళ్తుంది. మళ్ళీ రాగూడదన్న షరతు లేదుగదా! రాలేదు. అక్కడ కుట్టుపని నేర్చుకుంటోందని ఇటీవలే తెలిసింది. నేను నిజంగా ఆశ్చర్యంతో బిర్రబిగుసుక పోయాను. ఆనందంతో మైమరచిపోయాననుకో! స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యంతోబాటే ఆత్మ గౌరవం గూడా సిద్ధిస్తుందని నా అచంచలమైన నమ్మకం. మా ఆవిడ ఆదర్శ మహిళగా రూపొందడానికి పరోక్షంగానైనా కారణభూతుణ్ణి కాగలిగినందుకు నేనెంతో గర్విస్తున్నాను! ఇక మూడోది నా ఉద్యోగ విషయం - నాకు తరచుగా బదిలీ లెందుకు వస్తున్నాయో నువ్వు అడిగి తెలుసుకోవలసింది. అలా అడక్కుండా గొప్ప తెలివిమంతుడిలా ఊహాగానాలు చేయబోయావు. అసలు కథ వేరు! ఒక్కొక్కచోట పైవారి అసమర్థల వల్లనైతేనేమి, గ్రామోద్యోగుల తలబిరుసుతనం వల్ల నైతేనేమి, పనులు పేరుకపోతాయి. శిస్తులు బకాయిపడిపోతాయి. అప్పుడా పేరుక పోయిన గొడవనంతా ఒక కొలిక్కి తీసుకరావడానికి నిప్పులాంటి ఉద్యోగి ఒకడు కావలసి వస్తాడు. ఎక్కడెక్కడైతే అలాటివాడు అవసరమో అక్కడకల్లా నేను రవాణా చేయబడుతున్నాను. అసలు ఈ రెవిన్యూ డిపార్టుమెంటు స్వభావమే యింత! ఇక్కడ పనిచేయని మహరాజు చేయకనే జీతం పుచ్చుకోగలడు. చేసే వెధవ చేసి చేసీ తన జీవితకాలాన్ని కరిగించుకోగలడు...."

చుట్టుప్రక్కలవాళ్లు ఏమనుకుంటున్నారోనన్న స్పృహగూడా లేకుండా వీరభద్రం ఉపన్యసించుకపోతున్నాడు. వాడి తర్కకౌశలం ఎదుట సమ్మోహితమై, స్తబ్ధమైపోయిన నా బుద్ధి ఆ ఉపన్యాసంపైన లగ్నం కావడం లేదు. వీరభద్రం కాపురం చేయలేక పోవచ్చు. ఉద్యోగమూ చేయలేక పోవచ్చు కానీ బ్రతుకలేకపోడు! వీరభద్రాన్ని గురించి నేనీ మాట మాత్రం ఢంకా బజాయించి చెప్పగలను!

*(ఆనందవాణి, 1958)*